క్లుప్తంగా

ఎన్టీఆర్ జలాశయం గేట్ల ఎత్తివేత


నిండు కుండలా ఎన్టీఆర్ జలాశయం

పెనుమూరు(కార్వేటినగరం): తుపాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని కలవకుంట ఎన్టీఆర్ జలాశయం శనివారం రాత్రి పూర్తిస్థాయిలో నిండడంతో ఆదివారం రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు జలాశయం దిగువ మండలాలైన పెనుమూరు, గంగాధరనెల్లూరు సరిహద్దులో ప్రవహించే నీవానది పరివాహక ప్రాంత గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేశారు. అనంతరం ఇరిగేషన్ డీఈ జయచంద్ర, ఏఈ భరత్‌కుమార్‌రెడ్డి రెండు గేట్లు ఎత్తి నీటిని నీవానదికి నీటిని విడుదల చేశారు. జలాశయం నుంచి 200 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ


పాలసముద్రం: ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: ఎయిడ్స్ వ్యాధిపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బంది ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఎయిడ్స్‌పై అవగాహన పెంచుకుని సమాజంలో చైతన్యాన్ని కలిగించాలన్నారు. ఎయిడ్స్ రహిత భారతావనికి తమ వంతు కృషి చేయాలన్నారు. అలాగే విద్యార్థుల్లో మానవీయ విలువలు పెరగాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం సిబ్బందితో ర్యాలీ చేశారు. సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ సుశీల, మురళి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏసు లోకరక్షకుడు


జెండా ఆవిష్కరిస్తున్న పాస్టర్

పాలసముద్రం: ఏసు ప్రభు లోకరక్షకుడని క్రిస్మస్ సమయంలో ప్రతిఒక్కరూ దేవుడిని ప్రార్థించాలని పాస్టర్ పాల్‌రాజ్ అన్నారు. ఆదివారం శ్రీకావేరిరాజుపురం పంచాయతీ మిట్టదళితవాడలోని చర్చిలో క్రిస్మస్ పండుగ పురస్కరించుకుని జెండా ఆవిష్కరించారు. చర్చిలో ప్రత్యే ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసి జెండా ఆవిష్కరించారు.

జనజీవనం అస్తవ్యస్తం

తవణంపల్లె: ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజులు పాటు ఎడతెరపిలేని జడివాన కురిసింది. మండలంలో ఆదివారం సాయంత్రం 4 గంటల వరకు 59.19 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. జడివానతో మూగజీవాలకు గ్రాసం లేక నానాఅవస్థలు పడ్డారు. వర్షాలకు ఎలాంటి వాహనాలు, ప్యాసింజర్ ఆటోలు సైతం నడవలేదు. అరగొండ బహుదానదిలో నీటి ప్రవాహం కొంత పెరిగింది. మండలంలో వాగులు, వంకలు పారాయి. వర్షాలకు మట్టితో ఇటుకల కోసే పనులు ఆగిపోయాయి. కంది చెట్లలో ఏపుగా ఉన్న పూత రాలిపోయి తీవ్రంగా నష్టం కలిగించింది. వ్యవసాయ పనులు సైతం స్తంభించి పోయాయి.

ఫ్లెక్సీలతో ప్రమాదం

- తుపాను ఉన్నా అలాగే వదిలేయడంతో ప్రమాదాలు
- ఎక్కడంటే అక్కడ పడిపోతున్న ఫ్లెక్సీలు
- మహిళ తలకు తీవ్రగాయం
- దీంతో ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభం


చావడి వద్ద పడిన ఫ్లెక్సీ


టవర్‌క్లాక్ సెంటర్‌లో పడిన ఫ్లెక్సీ

నగరి: మున్సిపల్ పరిధిలో పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారుతున్నాయి. తుపాను హెచ్చరికలను ప్రభుత్వం జారీ చేసే సమయాల్లో అధికారులు లోతట్టు ప్రాంతాలు, నివాసాల్లోకి నీరు వచ్చే ప్రాంతాలు, కాలువ గట్లు బలంగా లేని చెరువులను పరిశీలించి, గుర్తించాల్సి ఉంటుంది. అయితే తుపాను గాలికి ఫ్లెక్సీలు నిలుస్తాయా, అవి కూలిపడితే ప్రజలకు కలిగే నష్టం, విద్యుత్ తీగలపై పడితే జరిగే ప్రమాదాలు తదితర అంశాలను మాత్రం పరిశీలించడం లేదు. దీంతో తుపాను తాకిడికి రోడ్డు పక్కనే ఉన్న ఫ్లెక్సీలు రోడ్డుపై వెళ్లేవారి గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. అదృష్టవశాత్తు కొన్ని ఫ్లెక్సీలు రోడ్డుపై పడే సమయంలో ఆయా ప్రాంతాల్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదాలు తప్పుతున్నాయి. అన్ని సమయాలు ఒకేలా ఉండవు. శనివారం రాత్రి ఓంశక్తి ఆలయం సమీపంలో ఓ ఫ్లెక్సీ బైక్‌పై వెళుతున్న ఒక జంటపై పడడంతో అభి అనే మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. అలా ప్రమాదాలు జరిగినపుడే అధికారులు మేలుకుంటున్నారు. పెట్టేవన్నీ రాజకీయ ఫ్లెక్సీలు కావడంతో అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

ప్రచారాలతో ప్రమాదం

మున్సిపల్ పరిధిలో వ్యాపార ప్రచారంతోపాటు రాజకీయ ప్రచారానికి వినియోగించే ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రధాన రహదారుల్లోనే కనిపించే ఫ్లెక్సీలు చిరిగిపోయి సమీపంలోని విద్యుత్ తీగలపై పడుతుండడంతో గంటల కొద్ది కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఉన్న భవనాలపై పెద్దపెద్ద ప్రచార హోర్డింగులు కనిపిస్తుంటాయి. ప్రజలను ఆకర్షించేందుకు వాణిజ్య సంస్థలు... ఆకర్షనీయంగా కనిపించేందుకు వీలుగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి చేతులు దులిపేసుకుంటున్నారు. వీరు పెట్టే రోజులకు తగినవిధంగా మున్సిపాలిటీకి ఫీజులు చెల్లించాలి. అయితే పెట్టే బోర్డులు కొండంత అయితే ఉండే ఫీజులు వసూలయ్యేది మాత్రం గోరంతే. మున్సిపాలిటీ ఏర్పడి రెండు దశాబ్దాల కాలం అవుతున్నా ఫ్లెక్సీల కారణంగా వసూలైన సొమ్ము రూ.2 లక్షలు మాత్రమే ఉంది. దీంతో మున్సిపల్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేసేప్పుడు నాణ్యత ప్రమాణాలపై పర్యవేక్షణ చేపట్టడం లేదు. ఫ్లెక్సీలు ఏర్పాటు చేసే క్రమంలో సరైన విధానం పాటించకపోవడం, కట్టిన కొయ్యలు ఎండకు ఎండి వానకు తడిసి పటుత్వం కోల్పోయినా వాటిని తొలగించడం లేదు. అలాగే ఉంచేస్తుండడంతో చిన్నపాటి గాలులు వీచినా ఆ ఫ్లెక్సీలు గాల్లో వేలాడుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఇలాంటి ఘటనలు జరుగుతున్నా... వీటిపై నియంత్రణ మాత్రం కరువైంది.

గాయపడిన మహిళకు పరామర్శ

శనివారం రాత్రి ఫ్లెక్సీ విరిగిపడి గాయపడిన అభి అనే మహిళను ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ నగరి పట్టణంలోని ఆమె నివాసానికి వెళ్లి కలిశారు. ఆయన వెంట తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ సతీష్, సీఐ మహేశ్వర్ తదితరులు ఉన్నారు.

ఫ్లెక్సీలు తొలగిస్తున్న అధికారులు



ఫ్లెక్సీల తొలగింపు ప్రారంభం

రెండు రోజుల క్రితమే హోరుగాలికి టవర్‌క్లాక్ సెంటర్ వద్ద ఫ్లెక్సీ విరిగి రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తు ఏ ప్రమాదం జరగలేదు. శనివారం ఉదయం నుంచి పలు ప్రాంతాల్లో ఫ్లెక్సీలు విరిగిపడ్డాయి. వీటిలో ఓంశక్తి ఆలయం వద్ద ఫ్లెక్సీ ప్రమాదానికి మహిళ గాయపడింది. దీంతో ఆదివారం పట్టణ పరిధిలోని ఫ్లెక్సీల తొలగింపును అధికారులు ప్రారంభించారు.

అత్యవసరమైతేనే బయటకు రండి

- పొంగిపొర్లుతున్న వాగులు

శ్రీరంగరాజపురం: ఫెంగల్ తుపాను ప్రభావంతో మండల వ్యాప్తంగా చెరువులు నిండి, వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై సూచించారు. తహసీల్దార్, ఎంపీడీఓ మోహన్‌మురళి, ఎస్ఐ సుమన్‌తో కలసి మండల వ్యాప్తంగా వాగులు, వంకలు, చెరువులను పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయని, ప్రజలు అత్యవసరమైతే తప్ప ఎవ్వరూ బయటకు రాకూడదన్నారు. ప్రజలకు అత్యవసరమైతే తుపాను టోల్‌ఫ్రీ నంబర్ 9491077028ను సంప్రదించాలన్నారు. అందుబాటులో మండల అధికారులు ఉండాలన్నారు. అనంతరం ఉధృతంగా ప్రవహిస్తున్న పాపిరెడ్డిపల్లి, జీఎంఆర్.పురం, పాతపాల్యం వాగులను పరిశీలించి ప్రమాద సూచిక బోర్డులను ఏర్పాటు చేశారు.

మెలకువలు పాటించాలి

పెనుమూరు(కార్వేటినగరం): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో నీట మునిగిన పంటలకు నష్టం వాటిల్లకుండా మెలకువలు పాటించాలని రాస్ కృషి కేంద్రం ఉద్యానశాఖ శాస్త్రవేత డాక్టర్ పీఎస్ సుధాకర్ అన్నారు. ఆదివారం తుపాన్ ప్రభావంతో నీటమునిగిన పంటలను ఆయన పరిశీలించి రైతులకు తీసుకోవాల్సిన సూచనలు, సలహాలను అందించారు.

రామాపురం వద్ద నీటమునిగిన మొక్కజొన్న పంట



నగరిపేటలో నేలకొరిగిన మిరప, నీటమునిగిన మిరప పంట





ఫెంగల్ ప్రభావం

- కొనసాగిన వర్షం
- నీట మునిగిన పంట పొలాలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- కుశస్థలి పరివాహక ప్రాంత ప్రజలకు హెచ్చరికలు


నేలకొరిగిన అరటి

నగరి: ఫెంగల్ తుపాను ప్రభావం నియోజకవర్గంపై ఎక్కువగా పడింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కొనసాగింది. నింద్ర మండలంలో 20.6 సెం.మీ, నగరి మండలంలో 11.6 సెం.మీ, విజయపురం మండలంలో 12 సెం.మీ వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నగరిపేట, టీఆర్ కండ్రిగ ఇందిరమ్మ ఇళ్ల ప్రాంతాల్లో వీధులు జలమయమైంది. పలు ప్రాంతాల్లో పొలాలపై నీరు నిలిచింది. కూరగాయల పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. రామాపురం వద్ద మొక్కజొన్న తోట నీట మునగగా, మిరపతోట నేలకొరిగింది. ఎం.కొత్తూరులో బెండకాయల తోట పై వర్షపు నీరు పెద్ద ఎత్తున నిలిచింది. వర్షంతోపాటు వాతావరణంలో చల్లదనం ఎక్కువగా చోటుచేసుకో వడంతో జనజీవనం స్తంభించింది. జనం ఇళ్లకే పరిమితమయ్యారు. చెరువుల్లో నీటిమట్టం పెరిగింది.

ప్రజలకు హెచ్చరికలు

అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా కృష్ణాపురం డ్యామ్ గేట్లు ఎత్తే ఆస్కారం ఉండడంతో కుశస్థలి నది పరివాహక ప్రాంత గ్రామాలైన అనంతప్పనాయుడు కండ్రిగ, కావేటిపురం ప్రాంతాల్లో సీఐ మహేశ్వర్ ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. నదికి వెళ్లే మార్గాల్లో ముళ్లకంపలు వేసి దారులను మూసివేశారు.

ఫెంగల్‌తో అన్నదాతల కష్టాలు

పాలసముద్రం: ఫెంగల్ తుపాను రైతన్నల గుండెల్లో అలజడి రేపింది. వాతావరణం మారి ఈదురుగాలులు, కురిసిన వర్షాలతో వరి, చెరకు పంటకు నష్టం వాటిల్లింది. ఫెంగల్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు చెక్ డ్యామ్ నిండింది. తుపాన్ వల్ల కురిసిన వర్షాలకు రైతులు సాగు చేసిన వరి, చెరకు దెబ్బతిన్నాయి. కోదండరామపురంలో వరి పంట నేలపాలైంది. పాలసముద్రం, ఏట్టుకూరిపల్లెలో కూరగాయల పంటలో నీరు చేరి పంట దెబ్బతింది. తొట్టికండ్రిగలో అరటి పంట నేలపాలైంది. వెంగళరాజుకుప్పకోన చెరువు మొరవపోతోంది. ప్రభుత్వం స్పందించి తుపాను ప్రభావంతో పలు పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు.

ఫెంగల్‌తో నీట మునిగిన పంటలు

కార్వేటినగరం: ఫెంగల్ తుపానుతో రెండు రోజుల పాటు కార్వేటినగరంలో భారీ వర్షాలు పడడంతో శనివారం 77.4, ఆదివారం 28.6 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండలంలోని ఏపిల్ చెరువు, అమ్మగారి చెరువులు మొరవ పారాయి. అదేవిధంగా రైతులు సాగు చేసిన మిరప, వరి, చెరకు పంటలు నీట మునిగాయి. ఫెంగల్ వల్ల చెరువుల నిండడంతో రైతన్నలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఈ వర్షంతో భూగర్భ జలాలు పెరిగి నీటి కొరత లేకుండా ఉండే అవకాశం ఉందంటున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో పాలసముద్రం మండలంలో 14.6 మిమీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు చెబుతున్నారు. అయితే కార్వేటినగరం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఉన్న 150 ఏళ్ల భారీ మర్రిచెట్టు జడివానకు సమీపంలో ఉన్న హోటల్ భవనంపై కూలిపోయింది. అదేవిధంగా సుద్దగుంట ఏఎడబ్ల్యూలో 50 సంవత్సరాల క్రితం నిర్మించిన 54 ఇందిరమ్మ పక్కాగృహాలు ఉరుస్తూ దుస్థితికి చేరుకున్నాయని, ప్రభుత్వం పట్టించుకోలేదంటున్నారు.








నది పరివాహక ప్రాంత ప్రజలను హెచ్చరిస్తున్న పోలీసులు, నగరిపేటలో వీధిలో ప్రవహిస్తున్న వర్షపు నీరు, వర్షానికి నేలకొరిగిన మర్రిచెట్టు, ఉరుస్తున్న పక్కాగృహాలు

ఎడతెరిపి లేని వర్షం


వడమాలపేట : ఎస్‌బీఆర్‌పురం చెరువు కలుజు

విజయపురం: ఫెంగల్ తుపాన్ ప్రభావంతో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి విజయపురం, వడమాలపేటల్లో వంకలు, కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. చెరువులు నిండి కలుజు పారుతున్నాయి. అధికారులు ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. చెరువులను పరిశీలించి, ప్రజలను చెరువు వద్దకు వెళ్లకుండా భద్రత ఏర్పాటు చేశారు. కాళికాపురం, గంగమాంబపురం, ఎం అగరం, ఇల్లత్తూరు, విజయపురం, పన్నూరు, తదితర గ్రామాల్లో నీట మునిగిన వరి, వేరుశనగ పంటలను అధికారులు పరిశీలించారు. చెరువు నిండి కలుజు పారుతున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ కిరణ్ తెలిపారు.


కాళికాపురంలో మినుము పంట


గంగమాంబపురంలో వేరుశనగ పంట

నిండుతున్న చెరువులు


చవరంబాకం చెరువుకు జలకళ

నింద్ర: తుపాను కారణంగా రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు నిండుతున్నాయి. ఆరూరు, ఇరుగువాయి, చవరంబాకం చెరువులకు నీరు చేరింది. చవరంబాకం చెరువు నిండి కలుజు పారుతోంది. చెరువులను తహసీల్దార్ శేషగిరి రావు ఆదివారం పరిశీలించారు. రబీ సీజన్‌లో వేరుశనగ పంటలు వేసిన రైతుల పొలాల్లో నీరు చేరింది. వ్యవసాయాధికారి తులసీరాం పరిశీలించారు.

పలు మార్గాలలో రాకపోకలు బంద్

వడమాలపేట(విజయపురం): ఫెంగల్ తుపాను ప్రభావంతో రెండు రోజులుగా వడమాలపేట మండలంలో ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో 18 చెరువులు నిండి కలుజు పారుతున్నాయి. వడమాలపేట మండలంలో ఆదివారం సాయంత్రానికి 255 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. చెరువులు నిండి కలుజు పారుతుండడంతో పలు మార్గాలలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వడమాలపేట నుంచి తిరుమండ్యం మార్గంలో వడమాల వద్ద కాలువ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో ఆదివారం ఉదయం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. ఓబీఆర్ కండ్రిగ పెద్ద చెరువు, వడమాల అత్తిగుంట చెరువు కలుజు నీళ్లు ఈ కాల్వలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ఓబీఆర్ కండ్రిగ, పాపరాజు కండ్రిగ, గోళ్లకండ్రిగ, వేమాపురం గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని కల్లూరు గ్రామం వద్ద అత్తూరు చెరువు కలుజు నీటి ఉధృతి కారణంగా ముందు జాగ్రత్త చర్యగా పోలీసులు కాలువకు ఇరువైపులా ముళ్లకంపను అడ్డంగా వేశారు దీంతో ఆ మార్గంలో శనివారం సాయంత్రం నుంచి రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే వడమాలపేట నుంచి పాదిరేడుకు వెళ్లే మార్గంలో దేశమ్మగుడి వద్ద పాదిరేడు చెరువు కలుజు నీళ్లు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వడమాలపేట వద్ద కాజ్‌వేపై వరద నీరు పొర్లుతోంది. పోలీసులు వాహనాలను బైపాస్ రోడ్డు మీదుగా మళ్లించారు.


వేరుశనగ పంట పరిశీలిస్తున్న ఏఓ

భవితకు బాట ప్రశస్త

- విద్యార్థుల్లో లోపాల గుర్తింపునకు ప్రత్యేక యాప్
- 21 లోపాలు గుర్తించే వీలు
- రెండు విభాగాలుగా యాప్ విభజన
- మొదటి దశలో గుర్తింపు, రెండో దశలో నిర్ధారణ
- అనంతరం వైద్యానికి సిఫారసు




ప్రశస్త యాప్ డౌన్‌లోడు చేసుకుంటున్న ఉపాధ్యాయులు

కార్వేటినగరం: విద్యార్థుల్లో పలువురికి మానసిక, సమస్యలుంటాయి. కొందరు గుర్తించలేని లోపాలు, అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పండుతుంటారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ఇటువంటి వారిని గుర్తించడానికి నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రిసోర్స్ అండ్ ట్రైనింగ్(ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో ప్రశస్త పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. ఉపాధ్యాయులే విద్యార్థులను పరిశీలించి వారిలోని లోపాలను ఈ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంది.

ఉపాధ్యాయులు చేయాల్సిందిదే

ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రశస్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని పేరు, ట్రెజరీ ఐడీ, మెయిల్ ఐడీ, సెల్ నంబరు, యూడైస్ కోడ్‌తో లాగిన్ అవ్వాల్సి ఉంది. అనంతరం యాప్‌లో సూచించిన విధంగా వివరాలు నమోదు చేయాలి.

21రకాల లోపాల గుర్తింపునకు అవకాశం

వైకల్యం ఉన్న పిల్లలను ధ్రువీకరించడం, స్క్రీనింగ్‌లో ఉపాధ్యాయులు భాగస్వామ్యాన్ని మెరుగుపరచడం, ఆశాస్త్రీయ నిర్ధారణ. లేబులింగ్ నుంచి రక్షణ. పిల్లల పరిస్థితి గురించి స్పష్టతను సులభతరం చేయడం, వైకల్యం ఉన్న విద్యార్థులకు సమగ్ర విద్యను అందించడం. దీని ముఖ్య ఉద్దేశంగా అధికారులు చెబుతున్నారు. విద్యార్థుల సామర్థ్యంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తారు, విద్యార్థుల్లో చదవడం, వినడం, మాట్లాడడంతో పాటు చెప్పిన పదాన్ని పదే, పదే చెప్పడం, రోజూవారీ పనులు సొంతంగా చేసుకోలేక పోవడం, అనుమతి లేకుండా తరగతి నుంచి వెళ్లడం, నెమ్మదిగా చదవడం, రాయడం, స్పష్టత లేని చేతి రాత, రివర్స్ రాయడం, గణిత చిహ్నాలు అర్థం చేసుకోలేకపోవడంలో ఇబ్బంది పడడం, పునరావృత ప్రదర్శనలో ఇబ్బందులు, ఆసక్తి లేకపోవడం, చెప్పిందే చెబుతూ ప్రతి స్పందించడం, విచారంగా కనిపించడం, త్వరగా అలసిపోవడం వంటి 21 రకాల లోపాల్లో దేనితో విదార్థులు ఇబ్బంది పడుతున్నారో ఉపాధ్యాయుల ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు చేస్తారు.

రెండు విభాగాలుగా నమోదు

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల వివరాలను నమోదు చేసే ప్రశస్త యాప్‌ను రెండు విభాగాలుగా విభజించారు. ఇందులో పొందుపర్చినట్లుగా ఉపాధ్యాయులు విద్యార్థులను కొన్ని ప్రశ్నలు అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. మరికొన్నింటిని వారే విద్యార్థిని నిశితంగా పరిశీలించి నమోదు చేయాల్సి ఉంటుంది. యాప్‌లో 63 రకాల ప్రశ్నలకు సమాదానాలు పొందుపరచాల్సి ఉంటుంది. పార్ట్-1లో లోపాలు గుర్తిస్తే, పార్ట్-2లో ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల లోపాలను ఉపాధ్యాయులు పరిశీలించి వైద్యులకు సిఫార్సు చేస్తారు.

సత్వర చర్యలు చేపట్టాం..

ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థుల వివరాలన్నీ వంద శాతం నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఈ మేరకు వివరాలు నమోదు చేసేలా ఆదేశాలు ఇచ్చాం. ఉపాధ్యాయులు నమోదు చేసిన వివరాలను ఉన్నతాధికారులు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటారు.

– విజయకుమార్, ఎంఈఓ, కార్వేటినగరం

స్క్రీనింగ్ ముఖ్యం..

ప్రశస్త యాప్ ద్వారా విద్యార్థులకు స్క్రీనింగ్ చేయడం ముఖ్యమైన అంశం. అభ్యసనంలో విద్యార్థులకు ఉన్న ఇబ్బందులను గుర్తించి సవరించేందుకు ప్రశస్త ఉపకరిస్తుంది. ఉపాధ్యాయులందరూ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, విద్యార్థులందరినీ సాధ్యమైనంత తొందరగా స్క్రీనింగ్ చేసి వివరాలు నమోదు చేయాలి.

– పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి, జిల్లా ఎస్ఎస్ఏ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, చిత్తూరు